# నలిగిన గులాబి

రచన ; "ఆర్.వి.ఆర్."



శ్రావణ గౌరి పౌర్ణమి. తెల్లని పాల వెన్నెల తనలోని అమర కాంతిని వెదజల్లాలని చందమామ ప్రయత్నం చల్లని చిరుగాలి వెన్నెలలో వింతగా మెరుస్తున్న అందమైన ప్రకృతి.

నిండు చందమామను చూస్తూ గౌరి తన గత గౌరీ పౌర్ణమి సంఘటనను గుర్తు తెచ్చుకుంది. గత పౌర్ణమికి తను పెళ్ళికానిపిల్ల. ఈ గౌరిపౌర్ణమికి తను సౌభాగ్యవతి.

ఒక్క ఏడాదిలో ఎంత మార్పు!

లోకదృష్టిలో ఆమెలో ఆ సంవత్సరాన జరిగిన మార్పు సౌభాగ్యవతి కావడమే! కాని యీరెండు గౌరీపౌర్ణముల మధ్య దాగిన విషాదగాథ ఎవరికి తెలుసు?

ఆ చల్లని రెండు గౌరి పౌర్ణముల మధ్య తన-జీవితపు మలుపు......

...శేఖర్ ఎంత మంచివాడో అట్లాంటి ఆదర్శవంతుడు కూడ! ఆదర్శవంతుడంటే ఆదర్శాలను వల్లించడమే కాదు. ఆచరణలో పెట్టగల ధీశక్తి గలవాడు.

అందుకే తను ఒక రాక్షసుని కబంధహస్తాల్లో నలిగిపోయిందని తెలిసి కూడ ముందుకువచ్చి, సంఘాన్ని ఎదిరించి తనను వివాహమాడేడు. అంతే కాదు తను గత విషాద-సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకొని బాధ పడుతున్నప్పుడు...అవన్నీ మరిపించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటాడు. పెళ్ళై ఐదునెలలు దాటింది. ఒక్కసారైనా తనను పల్లెత్తిమాటైనా అనలేదు. తను చేసిన తప్పును సమర్థిస్తూ క్షమించి సేవించడానికే ప్రయత్నిస్తుంటాడు.

నిష్కల్మష తత్త్వమైన శేఖరుకు తుచ్ఛ కామదాసుడైన గోపాల్ కు సామ్యం...నక్కకు దేవలోకానికి గల దూరమే!

'ఆనాడు'...గౌరి స్మృతి గతంలోనికి నడచింది.

గౌరీ పౌర్ణమి. చందమామ నిండుగా కమ్మని కాంతిని యిస్తూ సమస్త అవనీ జనులను ఊహాలోకాల్లో ఓలలా డేటట్లు చేస్తున్నాడు.

పెళ్ళికాని పిల్లలందరూ గౌరీ దేవిని తమ మనసులోని కామితములను తీర్చమని ఎన్నో విధాల పూజిస్తున్నారు.

పెళ్ళైన వారందరు తమ ఐదవ తనాలను చల్లగ కాపాడి తమకు నిత్య సౌభాగ్యాన్ని కలిగించమని కాత్యాయనీ దేవికి దీపధూప నైవేద్యాలను సమర్పించు కుంటున్నారు.

గౌరిది అందంగా, సన్నంగా, నాజూగ్గా చందనపు బొమ్మలా మెరిసిపడే విగ్రహం. తలంటు పోసుకోవడం వలన గాలికి ఎగురుతున్న ముంగురులు, ఉపావాళ్య తేజస్సుతో తళుక్కు కాంతులను వెదజల్లుతున్న కలువ కనులు.

చేతిలో పళ్ళెంతో గౌరీదేవికి సమర్పించవలసినవన్నీ జాగాడించుకుని కోవెలకు వెడుతుంది గౌరి.

'హల్లో గౌరి!' ఎక్కడికి? అంటూ చిలిపిగ పలుకరించాడు గోపాల్.

'గుడికి వెళ్ళేటప్పుడు అలా అడగ కూడదు!' సన్నగా నవ్వుతూ అంది గౌరి.

'అయితే దేవీగారు కోవెలకు వెడుతున్నారన్న మాట!'

'అన్న మాటేమిటి వెడుతున్నా!'

'ఆఁ! ఆఁ అంత తొందర! గౌరి చూశావ ఈ తెల్లని వెన్నెల, చల్లని గాలి...' ఆపేశాడు గోపాల్.

'ఆఁ: ఆగారేం? చల్లని గాలి...తరువాత...'

'గౌరి: ఈవేళ గౌరీ పౌర్ణమి. గౌరీ దేవిని ఏమని ప్రార్థిస్తావ్?'

'ఏమని ప్రార్థించమంటారు?' ఆశగ చూశాయి గౌరి కళ్ళు.

'...మనిద్దరికి త్వరలో వివాహం జరిగేటట్లు అనుగ్రహించమని.'

'అబ్బ! ఆశ!!'

'మరేమని పూజిస్తావ్?'

'మీరే చెప్పారుగా!...గోపాల్!...నిజంగ మీ నాన్నగారు మన పెళ్ళికి అంగీకరిస్తారంటావా?'

'ఇప్పుడెందుకా సందేహం వచ్చింది'.

'అది కాదు గోపాల్! మీ నాన్నగారికి డబ్బంటే ఆశ! అందుకని ఆతను అనుకున్నంత కట్నం యిస్తేగాని ...' జాలిగ చూస్తూ అన్నది గౌరి.

'ఛీ! అదా గౌరి నీ సందేహం! నేను కట్నానికి అమ్ముడిపోయే పశువు ననుకుంటున్నావా? డోంట్ మైండ్ ఎబౌట్ యిట్: ఏమైనా సరే మన వివాహం జరిగే తీరుతుంది.' దృఢంగ పలికాడు గోపాల్!

'గోపాల్!' గోపాల్ కౌగిట ఆనందంతో ఒదిగి పోయింది గౌరి.

నక్షత్రాలన్నీ ఒక్కసారిగ గౌరి హృదయంలో మెరిసాయి. పళ్ళెంలోని పూవులన్నీ తనను చూచి ఆనందంతో నవ్వినట్లు అనిపించింది గౌరికి.

'గోపాల్! యిప్పటికే ఆలస్యమయింది. కోవెలకు వెళ్ళి వస్తాను. యిక్కడే ఉంటారుగ! ప్రసాదం తెస్తాను!'

'ఓ! కె. దేవీగారు ప్రసాదం యిస్తామంటే భక్తుడు కాదంటాడు?'

'ఫీ పొండి:' అంటూ సిగ్గుతో కోవెలకు పరుగు తీసింది గౌరి. గోపాల్ జేబునుండి ఒక సిగరెట్ను తీసి వెలిగించాడు.

'గోపాల్!'

'ఓ! శేఖర్! కమాన్!' ఆహ్వానించాడు గోపాల్:

'గోపాల్! నీతో తీరిగ్గా కూర్చొని అభం శుభం తెలియని అమాయకురాల్లను మోసం చెయ్యడానికి రాలేదు.'

'శేఖర్! హద్దు మీరుతున్నావ్!' కోపంగ గర్జించాడు గోపాల్.

'హద్దు మీరుతున్నది నేను కాదురా! అందరిలాంటి ఆడది కాదురా గౌరి: ఉత్తమవనిత: శీలం ఆమెకు ప్రధానం. నిన్ను నమ్మి ఆమె తన సర్వస్వాన్ని నీకు దోసిల్లతో ధారపోసింది. నీలో కపటాన్ని ఆమె గ్రహించలేదు. దయచేసి ఆ అమాయకురాలికి మాత్రం అన్యాయం చెయ్యకు!' అరిచాడు శేఖర్.

'మోసం! ఉత్తమ వనిత! చాల్లే! మిత్రుడిగ నీ ఆశీర్వాదం యింతేనా?'

'మిత్రున్ని గనుక నే వక్రమ మార్గాన పోతున్న నిను సరియైన మార్గంలో పెట్టాలని ప్రయత్నిస్తున్నాను.

'నువ్వేమీ చెప్పనవసరంలేదు. దయచేసి యిక్కడ్నుంచి వెళ్లు' సిగిరెట్ విసిరి నేలకేసి కొట్టాడు.

'సరే!' నంటూ శేఖర్ నిష్క్రమించాడు.

♦ ♦ ♦ ♦

సముద్ర కెరటాలు ఎత్తుగ ఎగిసి పడుతున్నాయి. ఆ కెరటాలు కేరింతల్లో ఎన్నో గుడ్డిగవ్వలు, మంచి గవ్వలు, శంఖాలు తీరానికి కొట్టుకు వస్తున్నాయి. చల్లని ఆ సముద్రపు గాలిలోని మాధుర్యాన్ని ఆశ్వాదిస్తూ తెల్లని యిసుక తిన్నెపై కూర్చొని కనులు తెరుస్తూనే పగటి కలలను కంటూంది గౌరి.

దూరంనుంచి గౌరిని చూచి శేఖర్ అక్కడికి వచ్చాడు.

'గౌరి దేవిగారు:'

'ఓ.... శేఖర్:' ఉలికి పడింది గౌరి.

'గౌరీ దేవిగారు పగటి కలల్లో గాలి మేడలు కట్టుకొంటున్నారనుకుంటాను.'

'అంటే!...' సందేహం తొంగి చూచింది గౌరి కంఠంలో.

'గౌరిదేవిగారికి ఒక మాట చెబుతాను కోపం వస్తుందా'

'ఫరవాలేదు చెప్పండి!' యిసుకలో బొటని-వ్రేళ్ళతో కాళ్ళతో రాస్తూ అంది గౌరి.

'నా మాటను మీరు మన్నించిన, మన్నించకపోయిన, మీ శ్రేయస్సును కోరేవాణ్ణి కాబట్టి చెబుతున్నాను! గోపాల్ మీద ఆశలు పెంచుకోవడంలో నిరాశ తొంగి చూడక తప్పదు!'

'శేఖర్: గోపాల్! అల్లాంటి వాడు కాదు.!'

'గౌరి! నామాట నమ్మవు, నమ్మలేవు! గోపాల్ ను మనసార ప్రాణంకన్న మిన్నగ ప్రేమించేటప్పుడు నా మాటల్లోని సత్యాన్ని ఎలా గ్రహించగలవు? గౌరి!! ఆడ బ్రతుకు అరిటాకు! అరిటాకు ముల్లుతో చెలగాటం ఆడకూడదు. ఆడితే దాని ఫలితం అరిటాకు అనుభవించక తప్పదు:'

'శేఖర్ యిప్పుడు తెలిసింది! నేను గోపాల్ ను ప్రేమిస్తున్నానని మీకు యీర్ష్య: అందుచేతనే ఆయనమీద చాడీలు-చెబుతున్నారు. ఆయన ఎలాంటివారో నాకు తెలుసు!'

'గౌరి నన్నపార్థం చేసుకుంటున్నావు!'

'లేదు పూర్తిగ అర్థం చేసుకున్నాను. శేఖర్! దయచేసి గోపాల్ పై చాడీలు మరెన్నడూ చెప్పవద్దు.'

'గౌరి! నిజం బోధపడి, నిన్ను గోపాల్ కాదన్నప్పుడు-నే నన్నమాటలు పూర్తిగ అప్పుడు అర్థమౌతాయి. వస్తా:'

శేఖర్ నిష్క్రమించాడు.

WECO

మోటారులు-పంపులు

మరియు

మోనో బ్లాకులు



* చక్కని పరుగు.
* చిరకాల మన్నిక.
* ఖర్చులో తక్కువ.

మా తయారింపులు

* ఎలక్ట్రిక్ మోటారులు.
* సెంట్రిఫ్యూగల్ పంపులు.
* డొమెస్టిక్ పంపులు.
* మోనోబ్లాక్ సెట్స్.

: వివరములకు :

గ్రాంమ్స్:-"టెర్మినల్స్" ఫోన్ : ఆఫీసు :-25606. రెసిడెన్స్ :-32510

వేక్‌ఫీల్డ్ ఇంజినీరింగ్ కంపెని

తపాలు పెట్టె, నెం. 847

పీలమేడు కోయంబత్తూరు-4

గౌరి మనస్సులో శేఖర్‌పై కసురుకుంది. ఈర్ష్య-మనస్తత్వుడని తిట్టుకుంది. గౌరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలలోనుంచి ఒక పెద్ద వేడి నిట్టూర్పు మాత్రం వచ్చింది.

చిలిపిగ నవ్వుతూ వచ్చాడు గోపాల్!

'గోపాల్! వచ్చావా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను.

'ఓ! సో సారి! చాల ఆలస్యమయింది కదూ!'

పరవాలేదు లెండి! 'గోపాల్! మన పెళ్ళి విషయం మీ నాన్నగారికి చెబుతామన్నారు చెప్పారా?'

'అయితే కొంపదీసి అప్పుడే మీ నాన్నతో చెప్పేశావా?'

'ఇంకా లేదు లెండి:'

'అమ్మయ్య! చూడు గౌరి: నేను మా నాన్నతో చెప్పి ఒప్పించేవరకు యీ రహస్యాన్ని బయట పెట్టకు.'

'అలాగే!'

చక్కని అల్లిక - చిరకాల మన్నిక




వీనస్ నిట్టింగ్ కంపెని
తిరుప్పూరు (S.I.)

'ప్రామిస్!' చేయి చూపుతూ అన్నాడు గోపాల్!

'ప్రామిస్!' చేతిలో చేయి వేసి నవ్వుతూబదులిచ్చింది గౌరి.

'థేంక్స్'

♦ ♦ ♦ ♦

గౌరి తండ్రి జానకిరావు గాభరాగ బేగ్ సర్దుకొంటూ చీటికి మాటికి గంట చూచుకొంటూ భార్య కమలమీద కస్సుబుస్సు మంటున్నాడు.

'ఏమిటి నాన్న! ఏమిటీ హడావిడి!' నవ్వుకొంటూ ప్రవేశించింది గౌరి.

'హడావిడి కాదమ్మ! మన గోపాల్...అదే...రంగారావుగారి ఏకైక పుత్రుడు...పెళ్ళి తిరుపతిలో జరగబోతుంది. మూడు బస్సులను బంధుమిత్రులు వెళ్ళటానికి ఏర్పాట్లు చేశారు. నాతో పర్సనల్‌గ రమ్మని బ్రతిమాలాడు...రంగారావు, మీ అమ్మ గంటనుండి స్నానం చేస్తూనే ఉంది...యింకా రాదు. టైము చూస్తే అయిపోతుంది!' అన్నాడు హడావిడిగ జానకిరావు.

గౌరి మనస్సులో అగ్ని పర్వతాలెన్నో ఒక్కసారిగ బ్రద్దలైనై. సముద్రం పెద్ద పెద్ద కెరటాలతో ఎగిరి గంతేసింది. ఎన్నో భూకంపాలు ప్రళయ తాండవం చేసాయి. గౌరి కనుల్లో కలగ.

గౌరి గుండెలు గుభేల్ మన్నవి. 'నాన్న మీరన్నది గోపాల్ విషయమేగా?' వణుకుతున్న కంఠంతో అంది.

'అవునమ్మ! బయల్దేరు! మనం ఆ పెళ్ళి చూచి తీరాలి. కట్నం యాభై వేలు పుచ్చుకుంటున్నాట్ట.'

'నేను రాలేను నాన్న!' బావురుమంది గౌరి కంఠం.

'నీ యిష్టం.' బేగ్ పట్టుకొని బైటకు నడిచాడు జానకిరావు.

'అమ్మా! ఇల్లూ వాకిలి జాగ్రత్తగ చూచుకో! పెళ్ళి తీరగానే వచ్చేస్తాను,' అంటూ అన్ని జాగ్రత్తలు చెప్పి భర్త వెనుక దారి తీసింది. కమల.

గౌరి మనసంతా వికలమైంది. క్షణం క్రితం తనతో నవ్వుతూ మాట్లాడాడు గోపాల్, మాట మాత్రానికైన తనతో యీ విషయం ప్రస్తావించలేదు. గోపాల్‌కు యింకా యీ వివాహ విషయం తెలియదేమో! ఒకవేళ తెలిసే...మోసం చెయ్యాలని...అబద్ధం......గోపాల్ అల్లాంటి వాడు కాదు. శేఖర్ మాటలే నిజమౌతాయేమో! కాకూడదు...శేఖర్ మాటలు నిజం కాకూడదా. ఏమైనాసరే...ఒకసారి గోపాల్‌ను కలుసుకోవాలి. ఒకవేళ వాళ్ళనాన్న గోపాల్ నన్ను చేసుకోవడానికి అంగీకరించలేదేమో. అయితే గోపాల్ నిర్ణయమెలా ఉందో? రక రకాలైన ఆలోచనలు గౌరి మ

ష్కంలో మెఱుపు తీగల్లా వస్తూ మాయమౌతున్నాయి. పెను తుఫానునాడు పొంగి పొరలి తన్నుతున్న నదిలోని తెప్పలా ఉంది గౌరి మనసు.

తలంతా తెలియని ఆవేదనతో బరువెక్కింది.

నిర్లిప్తంగ నవ్వుకొని గోపాల్ని ఓసారి కలవాలని బయలుదేరి వెళ్ళింది గౌరి.

గోపాల్ మీద గౌరికి ఎంత అభిమానం, ప్రేమ ఉన్నాయో అంత మమకారం, నమ్మకం కూడ ఉంది. గోపాల్‌ను తన మనస్సులో ప్రతిష్ఠ చేసుకొని అనురాగ పుష్పాలతో కొలుస్తూ, అనుబంధ హారతినిస్తూ నమ్ముకొని ఉంది గౌరి. అంత నమ్మకాన్ని పెంచుకొని, తెంచుకొనే టంతటి పాపి గోపాల్ అని నమ్మలేకపోయింది గౌరి. ఒక ప్రక్క శేఖర్ మాటలు-మరో ప్రక్క గోపాల్ మృదుత్వం-యివన్నీ గౌరి మనస్సులో కలకలాన్ని రేపాయి.

గోపాల్ యిల్లు సమీపించింది. గోపాల్ ప్రయాణ సన్నాహంలో ఉన్నాడు, ఇంక బస్సులు రాలేదని ఎదురుచూస్తున్నాడు. అందరితో ఆనందంగా నవ్వుతున్న గోపాల్‌ను చూచిన వెంటనే గౌరికి మనస్సులో పిడుగు పడినంత పనైంది. దేహం చలితో కంపిస్తున్నట్లు గడగడమని వణుకసాగింది. కనులనుండి తనకు తెలియకుండానే కన్నీరు కార నారంభించింది. గోపాల్ అల్లంత దూరాన్నే గౌరిని చూచి పందిరిలో రభస జరుగకుండా ఎదురుగ వెళ్ళి తోటలోనికి దౌడు తీశాడు.

గౌరి, గోపాల్ వెంటపడింది. గోపాల్ ఆగకుండ సాగిపోతున్నాడు. 'గోపాల్!' మెల్లగ పిలిచింది గౌరి. గోపాల్ ఆగి వెనుకకు చూచాడు.

'గోపాల్! నేను విన్నదంత అబద్ధమని ఒక్కమాటలో చెప్పేయ్ గోపాల్!' గాద్గదికంగా అరిచింది గౌరి.

గోపాల్ పలుకలేదు. శిలలా నిల్చుండి పోయాడు.

'గోపాల్! మీ నాన్న మన వివాహానికి అంగీకరించలేదా? చెప్పు గోపాల్! చెప్పు!' వెక్కి వెక్కి ఏడుస్తూ దీనంగ అడిగింది.

'...............'

'గోపాల్! పోనీ! మీ నాన్న అంగీకరించక పోతేనేం? మనం రిజిష్టర్డ్ మేరేజి చేసుకుందాం:' బ్రతిమాలుతున్నట్లు అభ్యర్థించింది గౌరి. అయినా గోపాల్ కదలలేదు.

గోపాల్! అయితే...యీ పెళ్ళి......యీ పెళ్లి...నీ మనస్ఫూర్తిగ చేసుకుంటున్నావన్నమాట. జవాబీయవేం?' నిలదీసింది గౌరి.

'అవును:' నిర్లక్ష్య పూరితమైన గోపాల్ కంఠం.

'గోపాల్!' బావురుమంది గౌరి. మూర్ఛపోయినంత పనైంది గౌరికి. అయినా ఎలాగో తేరుకొని-

'గోపాల్! నా చేతిలో చేయివేసి చేసిన ప్రమాణాలన్నీ బూటకాలేనా?! నాతో ఆడినవన్నీ నాటకాలేనా?!! ఆఖరికి.........ఆఖరికి నన్నొక పాత్రగ మిగిల్చావా గోపాల్!' పెల్లుబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ అంది గౌరి.

'గోపాల్! నిన్నే నా దేవునిగ నా మనస్సులో ప్రతిష్ఠ చేసుకొన్నాను. శేఖర్ నీమీద చెప్పిన సత్యాన్ని చాడీలుగ మార్చాను. నా దేవుడే నా కన్యాయం చేశాడు!' ఎంతో దుఃఖించింది గౌరి.

'గౌరి!' ధృడంగ పిలిచాడు గోపాల్.

'ఊఁ!' మొహాన్ని కప్పివేసిన ముంగురులను తొలగించింది.

గౌరి! యిదిగో! యీ వెయ్యిరూపాయలు తీసుకో నన్ను మరచిపో! నిర్లక్ష్యంగా అనేశాడు గోపాల్.

Tel : "FRACTIONAL" Phone : 24909

- SIMPLE CONSTRUCTION
- RELIABLE OPERATION
- SILENT RUNNING

S K M-Single Phase Motors.

S K P-Self Priming Centripetal Pumps.

S KM/S K P Unit Electric Pumping Sets

EACH UNIT IS THOROUGHLY TESTED BEFORE DESPATCH

FOR DETAILS

PLEASE CONTACT MANUFACTURERS:

SREE KRISHNA FOUNDRY

PAPANAIKENPALAYAM

COIMBATORE-18.

గౌరి పెద్ద ధ్వనితో నవ్వింది. గోపాల్ గౌరికి పిచ్చెక్కిందేమోనని భయపడ్డాడు.

'గోపాల్! ఏమిటిది? హుఁ! డబ్బు! డబ్బు:! ఇది ఎందుకు!

ఇంతేనా, నా విలువ యింతేనా? ఇది శీలానికి విలువా? లేక నావద్దనుండి మీరు పొందిన ఆనందానికి వెలా??'

'నీ యిష్టం! ఏమైనా అనుకోవచ్చు. మరి నీ ముహం నాకు చూపించకు: తెలిసిందా?' చకచక నడచిపోయాడు గోపాల్.

గౌరి కలలో కూడ గోపాల్ యిలా ప్రవర్తిస్తాడనుకోలేదు. శేఖర్ చెప్పిన మాటలన్నీ గౌరి చెవుల్లో మారుమ్రోగాయి.

'గోపాల్ నిన్ను మోసం చేస్తాడు!' ఇదే ధ్వని. శేఖర్ మాటలే యీనాడు నిజమైనాయి. నా మంచి గూర్చి చెప్పిన ఆ ఉత్తముణ్ని-యీర్ష్యా పరుడని, నీచుడని అనేక విధాలుగ ఆడిపోసుకున్నాను! ఆనాడే జాగ్రత్త పడవలసింది! గోపాల్ ప్రేమించింది నా శరీరాన్నేగాని నా మనస్సును కాదు. కలలోగూడ గోపాల్‌ను తలచకూడదు సరికద గోపాల్ చేత వంచింపబడిన యీ కల్మష దేహాన్నికూడ విసర్జించాలి!' చావుకు సిదమైంది గౌరి. లోకాలన్నీ తనను 'పతిత', 'పతిత' అని పరిహసిస్తూ తన చుట్టూ గిర్రుమని తిరిగినట్లనిపించింది గౌరికి.

లోకంలో ప్రేమ, దయ అన్నీ ఒక్కసారిగ మాయమైపోయాయనుకుంది గౌరి. లోకమే కార్చీకటి...... వెలుగు......హుఁ! అది మరి జీవితంలోనే కలలాంటిది. ఇక వెలుగులేదు. 'కబంధ హస్తాల్లో నలిగిన యీ గులాబీకి మరి వెలుగులేదు, వాడిపోయి, రాలిపోయి, నేలలో కలసిపోయి నసించి పోవడమే! యింతకు మించి యీ పుష్పానికి మరేదిన్నీ వ్రాయలేదా భగవంతుడు.' అడుగుల్లో తడబాటు...కంఠంలో జీర...కనుల్లోనీరు... విచారం...గౌరి కాలలన్నీ కల్లలుగా మారిపోయాయి. ఆత్మహత్య నిర్ణయంతో సముద్రంకేసి పరుగుతీసింది గౌరి.

సముద్రుడు రౌద్రంగ కెరటాలతో ఎగిరి పడుతున్నాడు. కడలి కెరటాలు ఎత్తుగ ఎగిరి దూకుతున్నాయి. సముద్రంనుండి విషాద వాయువులు వీస్తూ ఆ తీరాన్నంతటినీ-విషాదపు చీకటి రేఖలలో ముంచివేసినాయి. కారు మొయిల్లు పెడ బొబ్బలతో, ఉరుములతో పెద్ద పెద్ద మెఱుపుతీగలు చేస్తూ గౌరి పౌర్ణమి రాత్రుల్లను చీకటి రేఖలతో కప్పేసినై.

గౌరి సముద్రంలో దూకబోయే సమయంలో శేఖర్ వచ్చి ఆపేశాడు.

'శేఖర్!' విస్తుపోతు నిల్చుండి పోయింది గౌరి.

'అవును గౌరి! నేనే! ఈ సమయంలో ఎలా వచ్చావనా? నువ్వు గోపాల్‌తో కలసి తిరగడం చూచినప్పటి నుండి గోపాల్ నీకే-క్షణంలో నైనా ద్రోహం తలపెట్టవచ్చునని నిన్ను వెన్నాడుతూనే ఉన్నాను. గోపాల్ వివాహం నిశ్చయమయిందని తెలిశాక నీ వెంత పనికైనా సాహసిస్తావని నాకు తెలుసు...నీవు గోపాల్ దగ్గరకు వెళ్ళడమూ, గోపాల్ డబ్బుతో నిన్ను వదిలించుకోవడానికి యత్నించడము అంతా కనిపెడుతూనే ఉన్నాను. నువ్వు తిన్నగా సముద్రం కేసి నడచి వస్తుంటే - తప్పకుండ ఆత్మహత్య చేసుకోవడానికే నీవు-సాహసించబోతున్నావని నేను అర్థం చేసుకొని నిన్ను రక్షించుకోగలిగాను.' నిర్మలంగా చెప్పేశాడు శేఖర్ ఒక నిట్టూర్పును విడుస్తూ.

'శేఖర్! ఈ అభాగ్యురాలిని ఎందుకు రక్షించారు! దైవంలాంటి మిమ్ముల నే దూషించాను. నా మంచిని కోరి మందలించిన మిమ్ములను ఎన్నెన్నో మాటలతో గాయపరిచాను. నన్ను...క్షమించండి!'

'అంతమాట అనకు: యిందులో నా స్వార్థం కూడ లేక పోలేదు!'

'ఆశ్చర్యంగ చూచింది గౌరి.

'అవును గౌరి! బలత్కారమేమీ లేదు. నీకు కూడ ఏమీ అభ్యంతరం లేకపోతే...నిన్ను.... నేను....పెళ్లి చేసుకుంటాను!' తన మనోరథాన్ని జంకుతూ జంకుతూ తెలియ జేశాడు శేఖర్.

'శేఖర్! వద్దు శేఖర్! వద్దు! దైవపూజకు సజ్జుపుష్పాలే తప్ప కబందహస్తాల్లో, నలిగి రెక్కలు వాడిపోయిన పుష్పాలు పనికిరావు!' గద్గదంగ ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని బావురుమని ఏడ్చింది గౌరి.

'ఆ నిర్ణయం భక్తులు చేసుకున్నది. భగవంతుని దృష్టిలో అల్లాంటి భేదాలు లేవు! గౌరి! నిజంగ నామీద నీకు దెవం అనే నమ్మకమే ఉంటే నన్ను కాదనకు! ఒకసారి తెలిసో తెలియకో చేసిన తప్పుకు నీవు జీవితాంతం బలికాకూడదు. సంఘానికి బెదిరి పారిపోకూడదు. అది పిరికివారు, మూర్ఖులు చేసేపని, దానికి సవాల్‌గా నిలచి ఎదిరించి, పోరాడి విజయాన్ని సాధించాలి:' గౌరిని అంగీకరింప జేయాలని విశ్వప్రయత్నాలు చేశాడు శేఖర్'

గౌరి అంగీకార సూచనగా తలాడించింది కనులనుండి ధారగా కారుతున్న కన్నీటిని తుడుస్తూ-

'శేఖర్! మీ నాన్న, అమ్మ అంగీకరిస్తారంటావా?' సందేహంగ ప్రశ్నించింది గౌరి.

'ఆ బాధ్యత నాది. మీనాన్న, అమ్మ వచ్చిన తరువాత-సంప్రదాయ సిద్ధంగా నిన్ను చూచి, ప్రధానం పెట్టిస్తాను. ఐ. ఏ. ఎస్ కు సెలక్టయాను. ట్రైనింగ్ పూర్తి అయిన తరువాత మన పెళ్లి! సరేనా!' లాలనగ అన్నాడు శేఖర్.

'ఐ. ఏ. ఎస్ కు సెలక్టయారా!' ఆశ్చర్యంగా ప్రశ్నించింది గౌరి.

'అవును గౌరి! నా మనస్సు నీ రూపురేఖలను దిద్దుకున్నప్పటినించే నా కన్నీ శుభశకునాలే, ఎమ్. ఏ. ఫస్ట్ వచ్చింది-తరువాత...యిప్పుడు ఐ. ఎ, ఎస్ కు సీటు వచ్చింది!' నవ్వుతూ తన కౌగిట్లో కరగించేశాడు గౌరిని శేఖర్.

'ట్రైనింగ్ నుండి పునర్దర్శనం?' చిలిపిగ ప్రశ్నించింది గౌరి.

'ఆరు నెలలు తరువాత.' నవ్వుతూ బదులిచ్చాడు శేఖర్.

♦ ♦ ♦ ♦

'గౌరి! గౌరి' ప్రత్యక్షమయ్యాడు గోపాల్.

'హాఁ! గోపాల్! ఏమిటిలా దయచేశావ్!?' నిర్లక్ష్యంగ ప్రశ్నించింది గౌరి.

'గౌరి! శేఖర్ నన్ను నిర్దాక్షిణ్యంగా సస్పెన్షన్‌లో పెట్టాడు! అది తప్పించవూ!' వేడుకున్నాడు గోపాల్.

'అది కాని పని.' నిర్లక్ష్యం నటించింది గౌరిలో.

'గౌరి! యింతవరకు వచ్చావా? ఒకనాటి మన స్నేహాన్ని పురస్కరించుకొని యీ మాత్రం సహాయం చెయ్యమంటున్నాను! నా జీవితాన్ని నిలబెట్టమని అర్థిస్తున్నాను.' దీనంగ అరించాడు గోపాల్.

'స్నేహం! జీవితం! ఈ రెంటికి నిర్వచనం నీకు తెలుసా? ఆనాడు నీ కాళ్ళవేళ్ళ పడి బ్రతిమాలితేనన్ను కాదని కాలదన్ని వెళ్ళిపోయావే! నా జీవితాన్ని నిలబెట్టమని ప్రాధేయపడితే విసరికొట్టావు! ఆనాడే మైంది యీ స్నేహం, జీవితం: ప్లీస్ గెట్ ఔట్!' గర్జించింది ఆవేశంతో గౌరి.

అప్పుడే ఆఫీసునుండి వచ్చిన శేఖర్ లోపల సంభాషణము విని తలుపుచాటున పొంచి ఉన్నాడు.

గౌరి! అయితే నీ ఆఖరి జవాబు కూడ యింతేనా' యిదే ఫైనల్ అన్నట్లున్నది గోపాల్ కంఠం.

'అంతే!' ధృడంగ బదులిచ్చింది.

'అయితే కాచుకో! నీవు నాకు ప్రేమగ వ్రాసిన


PUMPS & MOTORS

INSTAL FOR MORE WATER AND BUMPER CROPS.



TO MEET THE NEEDS OF AGRICULTURE & INDUSTRY "IDEAL" THE MOST TRUSTED NAME IN PUMPS & MOTORS.

WE ALSO MANUFACTURE TEXTILE SPARES AND KIRSCHNER TYPE BEATER WITH BEARING PEDESTALS AND CARDING CONVERSION MATERIALS, FLOOR TYPE PEDESTALS FOR RING FRAMES.

——For Particulars——

Phone : 32407

IDEAL ENGINEERING INDUSTRY

GANAPATHI (P.O.) : : COIMBATORE-6.

ఉత్తరాలన్నీ ఉన్నాయి. అవన్నీ కలెక్టరు గారి ఎదుట పెట్టి నీ పచ్చని సంసారాన్ని చిచ్చుపెట్టి తీరుతాను.' ఆవేశంగా కత్తిదూసినట్లు పలికాడు గోపాల్.

'నీ యిష్టం! నీలాంటి తుచ్ఛులు నీచులు కాదువారు'

'అయితే...' మరేదో చెప్పబోయాడు గోపాల్. ఇంతసేపు తలుపు చాటునపొంచి ఉన్న శేఖర్ వచ్చాడు.

'నమస్కారం సార్!' తబ్బిబ్బవుతూ నమస్కరించాడు-గోపాల్

'ఆఁ! మళ్లీ యిక్కడికి ఎందుకు వచ్చావ్?' గద్దించింది. శేఖర్ కంఠం.

'అది కాదు సార్ నాకు...గౌ...' గోపాల్ మాట పూర్తికాకుండానే 'డోన్ట్ టాక్: ఆమె పేరు పట్టడానికి నీ కర్హత లేదు. నువ్వు పచ్చని సంసారాన్ని చిచ్చుల పెట్టే వాడని నాకెప్పుడో తెలుసు: మానవత్వం లేని మనిషిని నీవు! చేడపురుగువు.' ఆవేశంగ వణుకుతున్న కంఠంతో అనేశాడు శేఖర్.

'అది కాదు సార్! ఆమె నాకు వ్రాసిన...'

'ఉత్తరాలు సాక్ష్యంగ ఉన్నాయంటావ్! అంతా నాకు తెలుసు! అది నాకు తెలిసే గౌరి ముఖం చూచి నిన్ను సస్పెన్షన్‌లో పెట్టాను! లేకపోతే నువ్వు తిన్న లంచాలకు నిన్ను డిస్మిస్ చేసేవాణ్ని! గెటౌట్'

గోపాల్ చిన్నబోయిన ముఖంతో వెళ్లిపోయాడు. గౌరి కన్నీటితో వెక్కి వెక్కి ఏడుస్తుంది.

'గౌరి! కన్నీళ్ళు! ఛ! ఛ! ఏమిటది! నవ్వాలి! ఏది నవ్వు!' చక్కిలిగింత పెట్టాడు శేఖర్'

గౌరి సన్నగ నవ్వింది.

'గతాన్ని త్రవ్వుకొని బాధపడకు! చూడు! నీకో మంచి కానుక తెచ్చాను' అంటూ తన చేతిలోని ఫుల్ వాయిల్ చీరను గౌరికి అందించాడు శేఖర్:

'చీర! చాల బావుంది! ఎంతకు కొన్నారు?'

'ఆడదాని వనిపించుకున్నావ్! నచ్చింది కద-సాకం తేచాలు!'

'శేఖర్,' శేఖర్ కౌగిలిలో కరగిపోయింది గౌరి.

......................గతమంతా గౌరి కనుల ముందు కరగిపోయింది, గత గౌరీ పౌర్ణమికి యీ గౌరి పౌర్ణమికి మధ్య ఎన్ని చీకటి రేఖలు విలయ తాండవం చేశాయి! గతం గుర్తుకు రావడం వలన రెండు కన్నీటి బొట్లు మాత్రం రాలాయి.

కారు హారన్ వినబడడంతో ఉలిక్కిపడి పోర్టికో వైపున నడిచింది గౌరి. 'ఏమంత అలక్ష్యం?' భర్తను ప్రశ్నించింది గౌరి.

'నిన్న లేడీ డాక్టరు నిన్ను పరీక్ష చేశారు గద. అంతు కని యీరోజు సంగతి కనుక్కుందామని వెళ్ళాను, అప్పుడు ఆవిడ నన్నడిగారు 'పాప కావాల?' 'బాబు కావాలా' అని. నాకేం తెలుసు మా గౌరిని అడిగి చెబుతానని చెప్పేసి వచ్చేసాను, గడగడమని జరిగినదంతా ఒకే వాక్యంలో చెప్పేశాడు శేఖర్.

'ఛీ! పొండి:' ఇంటి ముందున్న పార్కులో 'తల్లీ బిడ్డ' శిల్పాన్ని చూచి సిగ్గుతో చేతులు ముఖానికి అడ్డం పెట్టుకుంది గౌరి.


చిరకాల మన్నిక - అతి ప్రకాశవంతమైనది - నవీన పనితనము - చక్కని అమరిక.




నావెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు,

విశిష్టతకు, ప్రసిద్ధి చెందినది.

మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.

తయారించువారు

NOVEL DIAMOND WORKS

WEST RANI St. : : TIRUCHIRAPALLI-8.